క్లుప్తంగా

నేడు ఓబుళరెడ్డిపేటలో ఫ్యామిలీ ఫిజీషియన్

చాపాడు : మండలంలోని పెద్దగురువళూరు పంచాయతీలోని ఓబుళరెడ్డిపేటలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్న వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను పంపిణీ చేయనున్నామన్నారు. ఇదే క్రమంలో మధ్యాహ్నం నుంచి గృహ సందర్శనలో భాగంగా ఇళ్లలో ఉండే దీర్ఘకాలిక రోగులను పరిశీలిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దువ్వూరు : మండల పరిధిలోని మదిరేపల్లె సబ్‌స్టేషన్‌లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వీరారెడ్డి ఆదివారం తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

నేడు కొట్టాలలో గడప గడపకు మన ప్రభుత్వం

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామ పంచాయతీలోని కొట్టాల గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాజారాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

బోదకొట్టం దగ్ధం



అమగంపల్లె దళితవాడలో కాలిపోయిన బోదకొట్టం

కాశినాయన : మండలంలోని అమగంపల్లె దళితవాడలో ఆదివారం ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో బోదకొట్టం దగ్ధమైంది. స్థానికులు తెలిపిన మేరకు అమగంపల్లె దళితవాడకు చెందిన బత్తులమార్తమ్మ పొలం పనులకు వెళ్లింది. మధ్యాహ్నం సమయంలో పిల్లలు బయట ఆడుకుంటూ ఉన్నారని తెలిపారు. హఠాత్తుగా బోదకొట్టం నుంచి మంటలు రావడంతో స్థానికులు పోరుమామిళ్ల ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వారు వచ్చేలోపే బోదకొట్టం పూర్తిగా కాలిపోయింది. బియ్యం, బట్టలు, భూమికి సంబంధించిన పాసుపుస్తకాలు, వంట సామగ్రి పూర్తిగా కాలిపోయాయని, రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు తెలిపింది.

బియ్యం వితరణ



ఆశ్రమానికి బియ్యాన్ని అందజేస్తున్న వెంకటేష్

కాశినాయన : మండలంలోని ఓబుళాపురం సగిలేరు ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమానికి ఆదివారం సోషల్ సర్వీస్ స్కీం కో ఆర్డినేటర్ తాల్లూరి వెంకటేష్ బియ్యం వితరణ చేశారు. ఆశ్రమ నిర్వాహకురాలు రామతులసి మాట్లాడుతూ ఎక్కడ అనాథలు కనిపించినా తమకు సమాచారం అందించాలని, మరింత మంది దాతలు ముందుకు వస్తే ఎక్కువ మందికి ఆశ్రయం కల్పిస్తామని తెలిపారు.

600 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

కడప అర్బన్: కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అగాడి వీధి నుంచి బెల్లంమండి వీధికి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న ప్రభుత్వ రేషన్ బియ్యంను ఆదివారం ఎస్‌ఐ జయరాముడు తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. దండుకు చెందిన వెంకట సుబ్బమ్మ, తన దోసెల అంగడి కోసం ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి తరలిస్తుండగా ఆటోను, 15 బస్తాలు (ఒక్కో బస్తాలో 40 కిలోలు) మొత్తం 600 కిలోలను పట్టుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

పెండింగ్ వేతనాలను చెల్లించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని ఆశా కార్యకర్తలకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కేసీ బాదుల్లా, నాయకులు చంద్రశేఖర్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్ళు అయ్యవారమ్మ, శాంతమ్మ, అమ్ములు, లలిత, సంతోషి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



సంక్షేమ బావుట బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మండలంలోని తాళ్లమాపురం గ్రామ పంచాయతీ మూలవారిపల్లె గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సంక్షేమ బావుట బుక్‌లెట్‌ను అందించారు. అన్ని వర్గాల వారికి అర్హతను బట్టి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. పేదలు చదువుకునేందుకు జగనన్న అమ్మ ఒడి, చేనేత కార్మికుల కోసం వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. మన బడి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అన్ని వసతులతో ఆధునీకరించినట్లు చెప్పారు. 200 రోజులకుపైగా నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాచిరెడ్డి కొండారెడ్డి, ఉపసర్పంచ్ మాచిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి రాజారాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ నంది మండలం వీరారెడ్డి, ఎంపీటీసీ గోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు తుపాకుల భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గురుస్వామి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కాకర్ల నాగేశ్వరారెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకుడు సుధాకర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోసా మనోహర్, బాషా, జయచంద్ర, బండారు సూర్యనారాయణ, సొసైటీ బ్యాంకు అధ్యక్షుడు తుపాకుల ప్రతాప్‌రెడ్డి, ఏపీ మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు జేష్టాది భాస్కర్, సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మంలో గోవుకు ప్రత్యేక స్థానం



గోశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఎంపీపీ సానబోయిన శేఖర్

ప్రొద్దుటూరు : హిందూ ధర్మ శాస్త్రంలో గోవుకు ప్రత్యేక స్థానం ఉందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక శ్రీకృష్ణాలయంలో కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోశాలను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి శ్రీకృష్ణాలయ యాదవ సేవా సంఘం అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ గోవును పూజిస్తే ముక్కోటి దేవతలను పూజించినట్లేనని హిందూ శాస్త్రాలు చెబుతున్నాయన్నారు. త్వరలో నియోజకవర్గ పరిధిలోని యాదవులతో ఆత్మీయ సభను నిర్వహించాలని కోరారు. ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి చొరవతోనే గోశాల నిర్మాణం జరిగిందన్నారు. అత్యధిక శాతం యాదవులు ఉన్న నంగనూరుపల్లెలో రామాలయ నిర్మాణానికి రూ.30లక్షలు విరాళాన్ని ఎమ్మెల్యే ప్రకటించారన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రమణ కుటుంబానికి ఎమ్మెల్యే రూ.10లక్షలు ఆర్థిక సహాయం అందించారన్నారు. శ్రీకృష్ణాలయ సేవా సంఘం అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ మాట్లాడుతూ గోశాల నిర్మాణం ప్రారంభించినప్పటి నుంచి అనేక అడ్డంకులు, అవాంతరాలు ఎదురయ్యాయన్నారు. ఎమ్మెల్యే ముందుండి నిర్మాణానికి సహకరించారన్నారు. నాటక అకాడమి డైరెక్టర్ బండారు లక్ష్మీదేవి సూర్యనారాయణ గోవుల కోసం రూ.60,300 విరాళాన్ని ముందుగా చెల్లించారని తెలిపారు. అనంతరం శ్రీకృష్ణాలయ యాదవ సేవా సంఘం అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ఎంపీపీ, బండారు లక్ష్మీదేవి సూర్యనారాయణను సన్మానించారు. కార్యక్రమంలో టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు చిప్పగిరి ప్రసాద్, శ్రీకృష్ణాలయ యాదవ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పామిడి రామసుబ్బయ్య యాదవ్, కార్యదర్శి గండి ఆంజనేయులు యాదవ్, కోశాధికారి ఆర్.వెంకటయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీహెచ్ నూతన కార్యవర్గం ఏర్పాటు



మిషన్ పింక్ హెల్త్ నూతన కార్యవర్గం, ఇతర డాక్టర్లు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని మహిళా డాక్టర్లు కలిసి ఐఎంఏ తరపున మిషన్ పింక్ హెల్త్ (ఎంపీహెచ్)ను ఏర్పాటు చేశారు. స్థానిక ఐఎంఏ హాల్‌లో ఆదివారం సాయంత్రం స్టేట్ ఉమెన్ డాక్టర్స్ వింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ హేమలత, సెక్రటరి డాక్టర్ వసుధ, ఎంపీహెచ్ సెక్రటరి డాక్టర్ లక్ష్మీసౌజన్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీహెచ్ గౌరవాధ్యక్షురాలిగా డాక్టర్ హేమలత, చైర్‌పర్సన్‌గా పద్మలత, సెక్రటరిగా సల్మా, ట్రెజరర్‌గా బి హేమలత, ఇతర కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఈ సంస్థ ద్వారా పలు కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తీర్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైద్యులు త్యాగరాజరెడ్డి, సాయిప్రసాద్, హరిష్, వరలక్ష్మి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సామాజిక కార్యకర్తలు

చాపాడు : మండలంలోని పల్లవోలు గ్రామ సమీపంలోని శ్రీ కాశినాయన వృద్ధాశ్రమంలో ఆదివారం ఆశ్రమ నిర్వాహకులు కటారు వెంకటయ్య సతీమణి కటారు లక్ష్మమ్మ నాలుగో వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ కవిత ఆధ్వర్యంలో 50 మంది నుంచి సేకరించిన రక్తాన్ని బ్లడ్ బ్యాంకుకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమానికి హాజరైన హైదరాబాద్‌కు చెందిన సుజయ, ప్రొఫెసర్ వినోదిని, సమీరా, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ప్రముఖ వైద్యులు వరుణ్, ప్రజానాట్య మండలి చంద్రశేఖర్, గంగా సురేష్, సుబ్బారెడ్డి, బషిరున్నీసా, సృజన శ్రీను, వడ్డే లక్ష్మీదేవి, నాగరాజు, హరిత, బయన్న హాజరయ్యారు. రక్తదానం చేసిన వారందరికీ జ్ఞాపికలను ఆశ్రమ నిర్వాహకులు అందజేశారు.

విద్యార్థి మృతికి కారకులపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న సునీల్‌కుమార్

మైదుకూరు : ఖాజీపేట బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి కార్తిక్ మధ్యాహ్న సమయంలో బావిలో ఈతకు వెళ్లి మృత్యువాత పడటం చాలా బాధాకరమని, విద్యార్థి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గండి సునీల్ కుమార్ తెలిపారు. మైదుకూరులో ఆదివారం ఆయన మాట్లాడుతూ హాస్టల్ అధికారులు సక్రమంగా విధులకు హాజరుకాకపోవడం, విద్యార్థులపై పర్యవేక్షణ లేకపోవడంతోనే విద్యార్థులు హాస్టల్ నుంచి బయటికి వెళుతున్నారన్నారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి రూ.25లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అజయ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

చాపాడులో ఐసీడీఎస్ కార్యాలయ ఏర్పాటుకు చర్యలు



సీడీపీఓ కార్యాలయం కోసం వినియోగించనున్న చాపాడులోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం

చాపాడు : మండల కేంద్రంలో అంగన్వాడీ కేంద్ర ప్రాజెక్టు కింద సీడీపీఓ కార్యాలయం ఏర్పాటుకు ఆదివారం సీడీపీఓ సావిత్రమ్మ, మండల అధ్యక్షుడు తెలిదేల లక్ష్మయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు జేష్టాది రాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు శాంతరాజు పరిశీలించారు. కార్యాలయం సౌకర్యవంతంగా ఉండేందుకు అద్దె భవనాలను సైతం పరిశీలించారు. గత కొన్నేళ్ల క్రితం మూతపడిన చాపాడులోని సాంఘిక సంక్షేమ హాస్టల్ భవనాలను ఆదివారం పరిశీలించారు. సీడీపీఓ కార్యాలయ నిర్వహణకు అనువుగా ఉండటంతో స్వల్ప మరమ్మతులు చేస్తే వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల అనుమతుల కోసం మండల అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతిపాదనలు పంపారు. త్వరలోనే చాపాడు నుంచి ఐసీడీఎస్ ప్రాజెక్టు సేవలు అందించనున్నట్లు సీడీపీఓ సావిత్రమ్మ తెలిపారు. కాగా ఇటీవల స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఐసీడీఎస్ ప్రాజెక్టులను రీ ఆర్గనైజ్ చేయడంతో మైదుకూరు, చాపాడు ప్రాజెక్టులుగా ఎంపిక చేసింది.

పొంచి ఉన్న ప్రమాదం



కోటవీధి సమీపంలో ప్రమాదకరంగా మారిన గుంత

బద్వేలు అర్బన్ : పట్టణంలోని కోటవీధి సమీపంలో రహదారి కల్వర్టుపై ఏర్పడిన గుంతతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు వాపోతున్నారు. ఈ రహదారి మీదుగా పట్టణ, మండల పరిధిలోని గూడెం, రఘునాథపురం, గాండ్లతిమ్మాయపల్లె, ఎత్తిరాజుపల్లె, తిమ్మరాజుపల్లె, నక్కలగండి వంటి 8 గ్రామాలకు నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. బస్సు సౌకర్యం లేని కారణంగా ఆటోల్లో ప్రయాణం సాగిస్తుంటారు. కల్వర్టు దెబ్బతిని పెద్ద గుంత ఏర్పడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రాత్రివేళల్లో గుంత కనిపించక ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. సమస్యను స్థానిక ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ఆర్‌అండ్‌బి, మున్సిపల్ అధికారులు స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టుపై ఏర్పడిన గుంతను బాగు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

పాలిసెట్–2023కి ఉచిత శిక్షణ

కమలాపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2023 పాలిసెట్‌కు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులంతా 2023 పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఏప్రిల్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. తమ కళాశాలలోనే గతంలో ఎన్నడూలేని విధంగా ఏప్రిల్ 16వ తేదీ నుంచి అత్యుత్తమ, అసాధారణ ఫ్యాకల్టీతో పాలిసెట్‌కు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. మే 10న పాలిసెట్ ఉంటుందన్నారు. దరఖాస్తు, కోర్సులు, సీట్ల వివరాలు తెలుసుకోవడానికి తమ కళాశాలలోనే హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. తమ కళాశాలలో డీఈసీఈలో 66 సీట్లు, డీఈఈఈలో 66 సీట్లు ఉన్నాయన్నారు. నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీలు రూ.200 చెల్లించాల్సి ఉంటుందని ఆయన వివరించారు. పాలిటెక్నిక్ ద్వార నైపుణ్య సామర్థ్యాలు మెరుగుపడి విద్యార్థులందరికీ పరిశ్రమల్లో త్వరగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. పూర్తి వివరాలకు తమ కళాశాలలో సంప్రదించాలని ఆయన అన్నారు.

యూటీఎఫ్ నిరంతర పోరాటం

కడప ఎడ్యుకేషన్: మున్సిపల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీడీఓ అధికారాలు కల్పిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వడంలో యూటీఎఫ్ పోరాటపటిమ, పీడీఎస్ ఎమ్మెల్సీ అకుంఠిత దీక్ష ఎంతో ఉందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు అన్నారు. ఆదివారం కడప యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల విద్యాశాఖలోని మున్సిపల్ ఉపాధ్యాయులను తీసుకరావడంలోను, మున్సిపాల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డీడీఓ అధికారాలు కల్పించడంలోనూ యూటీఎఫ్ నిరంతర పోరాటం చేసిందన్నారు.

బకాయిల చెల్లింపులో జాప్యమెందుకు

కడప ఎడ్యుకేషన్ : సంవత్సర కాలంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను ఎందుకు చెల్లించడం లేదని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం కడపలోని ఎస్టీయూ భవన్‌లో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి. రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యవసర కుటుంబ అవసరాల నిమిత్తం ఉద్యోగ, ఉపాధ్యాయులు పొదుపు చేసుకున్న సొమ్ము కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలన్నీ త్వర గా చెల్లించాలన్నారు. రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, నాయకులు సుబ్రమణ్యంరాజు, బాలగంగిరెడ్డి, ఇలియాస్‌బాష, ఆదినారాయణరెడ్డి, సంగమేశ్వరరెడ్డి, బాలరాజు, ఏపీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఏఐటియుసీ నాయ కులు నాగసుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు సురేష్‌బాబు, రమణయ్య, జయరామయ్య, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ విద్య అందరికీ అవసరమే

కడప కార్పొరేషన్ : ప్రస్తుత సమాజంలో ఆత్మ రక్షణ విద్యలు బాలబాలికలకు అవసరమని 50వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కె. రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయిపేట హైస్కూల్‌లో కరాటే నందు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించిన విద్యార్థులను వారు అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తాము నేర్చుకున్న విద్యలో నైపుణ్యత సాధించాలని, తద్వారా తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 37వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బసవరాజు, కరాటే మాస్టర్ ఉదయ్ కుమార్, విజయలక్ష్మి, రమేష్ పాల్గొన్నారు.

భూ ఆక్రమణ తొలగింపు



కాంపౌండ్‌ను తొలగించిన రెవెన్యూ అధికారులు

గోపవరం : మండలంలోని గోపవరం రెవెన్యూ పొలం సర్వేనెంబర్ 168–1 లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి ఆక్రమణను రెవెన్యూ అధికారులు ఆదివారం తొలగించారు. 'ప్రభుత్వ భూమి కబ్జా' అనే శీర్షికతో ఆదివారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. భూ ఆక్రమణ జరిగిన విషయం అప్పటికే రెవెన్యూ అధికారులకు సమాచారం రావడంతో తహసీల్దారు దామోదర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది సర్వే నిర్వహించారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించిన అధికారులు భూమి చుట్టూ వేసిన కాంపౌండ్‌ను తొలగించారు. 168–2 సర్వేనెంబరులో 45 సెంట్లు ప్రభుత్వ భూమిని పల్లా గిరిజమ్మకు డికేటీ పట్టా ఇచ్చారు. దీంతో పక్కనే ఉన్న ఖాళీ ప్రభుత్వ భూమిని కూడా కబ్జా చేసి చుట్టూ కాంపౌండ్ నిర్మించిన విషయం తెలిసిందే. ఏ మేరకు ప్రభుత్వ భూమిని ఆక్రమించారో హద్దులు కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఆ మేరకే కాంపౌండ్‌ను తొలగించి పట్టా ఇచ్చినంత వరకే కంచె వేసుకోవాలని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూమిని ఎవరైనా కబ్జా చేసినా, చేయాలని ప్రయత్నించినా ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని తహసీల్దారు హెచ్చరికలు జారీ చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఎస్‌సీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1976-79 బ్యాచ్ బీకాం విద్యార్థులు

ప్రొద్దుటూరు : స్థానిక ఎస్‌సీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం ఏర్పాటు చేశారు. 1976–79 బ్యాచ్‌కు చెందిన బీకాం విద్యార్థులు ఏర్పాటు చేసుకున్న ఈ సమావేశంలో పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులను విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు పరిచయం చేసుకుని, ఏమి చేస్తున్నారో, వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారు చదువుకున్న సమయంలో తరగతి గదిలోని జ్ఞాపకాలను పంచుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మునిశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వీరయ్య, న్యాయవాదులు కాకర్ల నాగేశ్వరారెడ్డి, ఈవీ సుధాకర్‌రెడ్డి, పల్లవోలు రామమోహన్‌రెడ్డి, రిటైర్డు అధ్యాపకులు దస్తగిరిరెడ్డి, లక్ష్మీరెడ్డి, నాగిరెడ్డి, నాయక్, శ్రీధర్, డిప్యూటీ ప్రిన్సిపాల్ బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కమలాపురం : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయముల సంస్థ తాడేపల్లి ఆధ్వర్యంలో కమలాపురం గురుకుల పాఠశాల నందు 5వ తరగతి, ఇంటర్ ఫస్టియర్(ఇంగ్లీష్ మీడియం) ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ తులశమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ కోర్సుల్లో విద్యార్థినులను ప్రవేశ పరీక్షల ద్వారా ఎంపిక చేస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను మార్చి 24వ తేదీలోపు నెట్ సెంటర్ ద్వారా గాని, సమీపంలోని గురుకుల పాఠశాలల నుంచి గాని ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 5వ తరగతి విద్యార్థినులకు ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థినులకు అదే రోజు మధ్యాహ్నం 2గం. నుంచి 4.30 గంటల వరకు ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె అందులో తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నవదుర్గ వేషధారణలో చిన్నారులు



నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మోడంపల్లెలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలను భక్తులు విశేషంగా దర్శించుకుంటున్నారు. సాయంత్రం నవదుర్గ వేషధారణలో చిన్నారులు అందరిని ఆకట్టుకున్నారు. నటరాజ కళాక్షేత్రం నాట్య గురువు మొహిద్దీన్ ఖాన్ ఆధ్వర్యంలో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. మోక్షగుండం వీధి ఓంశాంతి భవన్ ఇన్‌చార్జి పావని బెహన్‌జీ ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రాముఖ్యతను వివరించారు.

ఘనంగా జరిగిన గంగమ్మ జాతర

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలేటిపల్లె–కొత్తపేట సరిహద్దులోని గంగమ్మ ఆలయం ఆదివారం జనసంద్రంగా మారింది. జాతర ముగిసిన తర్వాత వచ్చే నాలుగు వారాల్లో భాగంగా మొదటి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే ఆలయ ఆవరణలోని వీరభద్రస్వామి, సాయిబాబా, ఆంజనేయస్వాములను భక్తులు దర్శించుకున్నారు. అనంతరం బంధు మిత్రులతో కలిసి విందు భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ బి.అరుణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

పేదలకు ఉచితంగా 40 బస్తాల వరిధాన్యం

కడప ఎడ్యుకేషన్ : లేవాకు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ లేవాకు లక్ష్మిరెడ్డి తమ పొలంలో పండిన వరిధాన్యాన్ని రామరాజుపల్లె, పబ్బాపురం, రామచంద్రాపురానికి చెందిన 40 మంది పేదలకు 40 బస్తాల వరిధాన్యాన్ని ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. లేవాకు లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా తమ పొలంలో పండిన వరి ధాన్యాన్ని ప్రతి ఏటా పేద వర్గాలకు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో లేవాకు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి, బాలాజీ ఎంబీఏ కళాశాల చైర్మన్ లేవాకు నితిష్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.